ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను ఎగురవేయాలి

హర్ ఘర్ తిరంగాలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర-విజయనగరం : దేశవ్యాప్తంగా ఆగష్టు 9 నుంచి 15వ తేదీ వరకు చేపట్టిన హర్ ఘర్ తిరంగా ఉద్యమంలో ప్రతి పౌరుడు జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ జెండా, దేశం పట్ల తన దేశభక్తిని వెల్లడించాలని రాష్ట్ర చిన్న,మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్.ఆర్.ఐ. వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద జాతీయ జెండాను చేతబూని ఉద్యమంలో పాల్గొన్నారు. యీ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి ఉద్యమంలో పాల్గొనడం దేశ పౌరునిగా ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, డి.ఆర్.ఓ. ఎస్.డి.అనిత, డి.ఎస్.డి.ఓ. వెంకటేశ్వరరావు, టూరిజం అధికారి లక్ష్మీనారాయణ, మెప్మా పి.డి. సుధాకర్ పలువురు జిల్లా అధికారులు కూడా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు.

జె.సి. సేవలను ప్రశంసించిన మంత్రి కొండపల్లి

విజయనగరం: జిల్లాలో జాయింట్ కలెక్టర్ గా ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కె.కార్తీక్ ప్రశంసనీయమైన సేవలు అందిం చారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బదిలీపై నెల్లూరు జాయింట్ కలెక్టర్‌గా వెళ్తున్న నేపథ్యంలో మంత్రి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. రానున్న రోజుల్లో మరింతగా సేవలందించి ప్రజా జీవితంలో ఉత్తమ అధికారిగా పేరు ప్రఖ్యాతులు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆగస్టు 15 నుంచి రెవెన్యూ సదస్సులు

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

16న స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ సిసోడియా రాక

విశాలాంధ్ర-విజయనగరం: భూ సంబంధిత సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించే లక్ష్యంతో ఆగష్టు 15 నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. ప్రభుత్వం గొప్ప ఆశయంతో, ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడు తున్న ఈ సదస్సులను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలోని తాశిల్దార్లు, ఎంపిడిఓలు, ఇతర సిబ్బందితో కలెక్టరేట్లోని తన ఛాంబర్ నుంచి సోమవారం జిల్లా కలెక్టర్ అంబేద్కర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆగష్టు 15న విజయనగరంలో మంత్రిచే రెవెన్యూ సదస్సులు లాంఛనంగా ప్రారంభం అవుతాయని, మొత్తం 45 రోజులపాటు వీటిని నిర్వహిస్తామని తెలి పారు. ఆగష్టు 16 నుంచి జిల్లా అంతటా పూర్తిస్థాయిలో అన్ని మండలాల్లో సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీరోజు ఏదో ఒక గ్రామంలోని రెవెన్యూ సదస్సుకు తాను హాజరువుతానని, ప్రతిరోజు ఉదయం 9 గంటలకే సదస్సు ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. 5వేల జనాభా కంటే ఎక్కువ ఉన్న గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు సదస్సులు నిర్వహించాలని చెప్పారు. ఈ సదస్సుల్లో ఎంఎల్ఏలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా పాల్గొంటారన్నారు. ముందుగానే ప్రతీ మండలంనుంచి షెడ్యూల్‌ను రెవెన్యూ సదస్సులకు రెవెన్యూ అధికారులతోపాటు, సర్వేయర్, దేవాదాయ, అటవీ వక్ఫ్‌బోర్డు, రిజిష్ట్రేషన్ శాఖల ప్రతినిధులు కూడా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామపటాన్ని కూడా ముందుగానే సిద్దం చేసుకోవాలన్నారు. వెళ్లేటప్పుడు ఆ గ్రామానికి సంబంధించిన ఎఫ్ఎంబి, ఆర్ఓఆర్, 1-బి, అడంగల్, ప్రభుత్వ భూముల వివరాలు తదితర అన్ని రకాల రికార్డులను తమతోపాటు తప్పనిసరిగా తీసుకువెళ్లాలని సూచించారు. సదస్సు ముగిసిన తరువాత, సాయంత్రం 7 గంటలు లోపు పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల ను ఏరోజుకారోజు తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. దీనికోసం సచివాలయ సిబ్బందిని సైతం వినియోగించాలని సూచించారు. జిల్లాలో రెవెన్యూ సదస్సులను పరిశీలించడానికి స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా ఈ నెల 16న రానున్నారని, ఆయన రోజంతా ఇక్కడే ఉండి మండలాల్లో పర్యటిస్తారని తెలిపారు. ఎంపిడిఓలు పారిశుధ్యంపై మరింత దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన సామగ్రిని పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా అక్టోబరు 02 నాటికి జిల్లాలోని అన్ని చెత్తనుండి సంపద సృష్టి కేంద్రాలూ(ఎస్‌డబ్ల్యుపిసి) శతశాతం పనిచేయించాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న 601 కేంద్రాలకు, 211 మాత్రమే పనిచేస్తున్నాయని, మిగిలిన 390 కేంద్రాలూ పనిచేయించేందుకు ఇప్పటినుంచే చర్యలు ప్రారంభించాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఓ ఎస్‌డి అనిత, సిపిఓ పి.బాలాజీ, జెడ్‌పి సిఇఓ శ్రీధర్‌రాజా పాల్గొన్నారు.

విద్యార్ధులకు ఆటల పోటీలు

విశాలాంధ్ర-వంగర: మండల కేంద్రం వంగర వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌లో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆటపోటీలు నిర్వ హించారు. గత రెండు రోజులనుండి సీనియర్ జూనియర్ విభాగాల్లో ఖోఖో, క్రికెట్, కబాడీ వాలీబాల్, వ్యాసరచన పోటీలు నిర్వహి స్తున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ బి. ఈశ్వరరావు తెలిపారు. ఆగష్టు 15న స్వాతంత్ర దినోత్సవం పాఠశాల వద్ద జాతీయ పతాక ఆవిష్కరణ చేసి న అనంతరం,ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు ప్రదానం చేస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యాజమాన్య సభ్యులు ఎం.నేతాజీ, వివిక్ మాస్టర్ మైండ్స్‌ఉపాధ్యాయులు ఎస్. చక్రపాణి, రెడ్డి ఈశ్వరరావు, కె.రమేష్ శంకర్ రావు, డి.దాలినాయుడు, శ్రీను వాసరావు,శివకృష్ణ, హరి బాబు, విశాలాక్షి, జ్యోతి, అరుణ అలివేణి, కె.పద్మ,ఉమ మహేశ్వరి, భారతి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల ఉచ్చులో పడవొద్దు

సత్య డిగ్రీ కళాశాలలో విద్యార్ధులకు అవగాహన

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: స్థానిక తోట పాలెంలో గల సత్య డిగ్రీ& పీజీ కళాశాలలో సోమవారం కళాశాల ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశిభూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి పోకూడదని, అటువంటివి ఒక వేళ ఉపయోగిస్తే వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, సమాజ పరంగా ఎంతో నష్టం జరుగుతుందన్నారు. కావున విద్యార్థులు చాలా అప్రమత్తంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా విచ్చేసిన కేసలి అప్పారావు, ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలవుచ్చులో పడకూడదన్నారు. ఈ మాదక ద్రవ్యాలను తీసుకుంటే మనిషి విచక్షణ కోల్పోతాడని అందువలన విద్యార్థులు వీటి జోలికి పోకుండా చదువు పైన శ్రద్ధపెట్టి ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. అనంతరం విద్యార్థులందరూ మాదక ద్రవ్యాల జోలికి పోము అని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ సత్య వేణి, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ బి సూరపునాయుడు, ఎన్ సి సి కాడెట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-గరివిడి: స్థానిక గరివిడి అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీ లో సోమవారం ఉదయం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ అధ్యక్షతన మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్.దామోదర్ రావు ఎస్సై గరివిడి నుండి విచ్చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి యువత దేశానికి శక్తి అటువంటి యువత గంజాయి, కొకైన్, హాఫీష్, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు. విద్యార్థులు సైబర్ క్రైమ్స్ పట్ల కూడా జాగ్రత్త వహించాలని తెలుపుతూ నకిలీ కాల్స్,నకిలీ యాప్స్ కు స్పందించ వద్దని తెలిపారు.చివరగా విద్యార్థులతో డ్రగ్స్ జోలికి పోభోమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్.ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ,ఏ.ఓ జి.అనిల్ కుమార్,వివిధ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ వాలంటీరు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై భారత త్రివర్ణ పతాకం ఎగరవేయాలి

విశాలాంధ్ర-రాజాం: రాజాం పట్టణంలో రాజాం రెడ్ క్రాస్ ఆధ్వర్యం లో దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా ప్రతీ ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలని మనందరి కోసం ప్రాణత్యాగాలు చేసిన మహాపురుషులను స్మరించుకుని వారి అడుగుజాడల్లో నడవాలని రాజాం రెడ్ క్రాస్ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ స్వప్న హైందవి ప్రసంగించారు. భారత దేశ త్రివర్ణ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తా సాయి ప్రశాంత్ , స్వప్న హైందవి, జాతీయ యువజన అవార్డ్ గ్రహీత పెంకి చైతన్య కుమార్, ఉల్లాకుల నీలకంఠ యాదవ్, ఎన్ ఎస్ ఎస్ పిఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆహుతులను ఆకట్టుకున్న మిడ్ మ్యూజిక్ ఫెస్టివల్



విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : విజయనగరం ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణం లోని కొత్తపేట ఆర్యసోమ యాజుల కాశీపతిరావు స్మారక భవనం లో గత మూడు రోజులుగా జరుగుతున్న మిడ్ మ్యూజిక్ ఫెస్టివల్స్. సోమవారం జరిగిన చెన్నై కు చెందిన మల్లాజోస్యుల శ్రీ కాంత్ గాత్రం సంగీత కచేరి ఆహుతులను ఆద్యంతం ఆకట్టుకుంది. ఎం.పావని సహకార గానం చేశారు. ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఇ.ఆర్.సోమ యాజులు,(రాంజీ) విద్వాంసులను సత్కరించారు. సంస్థ కార్యదర్శి ప్రముఖ టాప్ గ్రేడ్ మృదంగ విద్వాంసులు డాక్టర్ మండపాక రవి ఈ ఉత్సవాలు పర్యవేక్షించారు...

ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

దేశ స్వాతంత్రంలో పోరాటం చేసిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్

ఎయిమ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ బాలాజీ

ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణం

$Xæý²+ç<óŠ-$ÈjáTq>·sÁ+ {…H : పట్టణంలో ఉన్న ఎయిమ్స్ పాఠశాలలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య 89వ వార్షికోత్సవాల సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం సిహెచ్ బాలాజీ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బాలాజీ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.నాగభూషణం మాట్లాడుతూ దేశంలో స్వేచ్ఛ సమానత్వం అందరికీ విద్యా వైద్య ఉపాధి హక్కులు అందుతున్నాయంటే దేశ చరిత్రలో పోరాటం చేసిన ఏకైక విద్యార్థి సంఘం ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్ పోరాటం అలుపెరగని ఇంకా విద్యార్థులు పోరాటం చేయడం ద్వారా తమ హక్కులు కాపాడుకుంటారని విద్యార్థుల రాజకీయాల్లోకి రావడం ద్వారానే ప్రక్షాళన జరుగుతుందన్నారు. ఇవాళ దేశంలో విద్యా వ్యవస్థ విచ్ఛిన్నమవుతున్నదని దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థుల మీదే ఉన్నదని కాబట్టి విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ప్రధానంగా వైద్య, విద్య సాంకేతిక విద్యలో శాస్త్రీయత లోపించి భావాలను పెంపొం దిస్తున్నారని నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకించాలన్నారు. ఇవాళ 117జీవో రద్దు చేయాలని, యూనివర్సిటీ కేంద్రాలలో విద్యార్థులకు స్వేచ్ఛని ఇవ్వాలని నిధులు ఇవ్వాలన్నారు. ప్రాథమిక విద్యను కాపాడాలని, విచ్ఛిన్నమవుతున్న విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలన్నారు. రాష్ట్రంలో కేంద్రంలో జరుగుతున్న విద్యావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధంకావాలని కోరారు. నవంబర్‌లో జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి.గౌరీ శంకర్ ఏఐవైఎఫ్ నాయకులు బి .వాసు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: ఉద్యమాలలో ఉద్భవించి, పోరాటాలలో రాటుదేలి సామ్యవాద సమాజ స్థాపన కోసం అవిరళ త్యాగాలతో ఉద్యమాన్ని నిర్మిస్తున్న ఏకైక విద్యార్థి సంఘం అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ ఏఐఎస్ఎఫ్ అని బొబ్బిలిలో జరిగిన ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న వ్యక్తలు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వి శ్రావణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా ఏఐఎస్ఎఫ్ జెండాను ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మునకాల శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పాలనకు సమాధి కట్టడంలో ఏఐఎస్ఎఫ్ అగ్రభాగాన నిలిచిందన్నారు. ఏఐఎస్ఎఫ్ మాజీ ప్రధాన కార్యదర్శులు కోట అప్పన్న బీశపు సాయికిరణ్ యాదవ్ మాట్లాడుతూ విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థులు వ్యతిరేకిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు. ఎస్ ప్రవీణ్. ఆర్ గౌరీ. గాయత్రి జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ నోబుల్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్ రంగరాజు



విశాలాంధ్ర-విజయనగరం టౌన్: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు ఉన్నత పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్ రంగరాజు, యూనియన్ ప్రధాన కార్యదర్శి జె. కామేష్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మూడు సంవత్సరాల సరెండర్ లీవ్ తక్షణమే కార్మికుల ఖాతాల్లో జమ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులకు 62 సంవత్సరాలు కొనసాగించేలా చర్యలు చేపట్టాలన్నారు. కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులకు పదవీ విరమణ పొందిన సమయానికి 75 వేల రూపాయల గ్రాడ్యుటీతో పాటు, సంవత్సరానికి 2000 ఇస్తామన్న హామీ అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చనిపోయిన కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులకు రెండు లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా తో పాటు కుటుంబంలో ఉన్న ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. కార్మికులకు 2022లో జనవరి ,సెప్టెంబర్ ల యొక్క హెల్త్ అలవెన్సులు ఇవ్వాలన్నారు. సూపర్వైజర్లకు జీవో నెంబర్ ఏడు ప్రకారం 18,500 అమలు చేసినప్పటికీ అది ఇంతవరకు చెల్లించలేదన్నారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నం చేయాలన్నారు ఈ కార్యక్రమంలో పి రామకృష్ణ ,ఎం రాజు ,ఆర్ సారీ తదితర కార్మికులు పాల్గొన్నారు

వర్గీకరణ తీర్పుపై భగ్గుమన్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ..

కలెక్టరేట్ వద్ద ఆందోళన



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు పునః సమీక్షించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ ఎస్సీలను వర్గీకరించి, వారిలో అనైక్యత ను తీసుకు వచ్చి రాజ్యాధికారానికి దూరం చేయాలన్న అగ్ర వర్ణాల కుట్రలో భాగంగానే సుప్రీం కోర్టు వర్గీకరణపై తీర్పు ఇచ్చిందని ఆక్షేపించారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న ప్రధాని మోడీ రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఆలోచన చేస్తున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణపై 2004 నవంబర్లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ప్రతీ ఒక్కరూ గౌరవించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పును పునః సమీక్షించుకోవాలని కోరారు. అదేవిధంగా 1950 లో అప్పటి జనాభా నిష్పత్తి ప్రకారం ఎస్సీలకు 15% రిజర్వేషన్ల కల్పించారని, ఐతే ఇప్పుడు జనాభా పెరిగిందని దాన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్సీలకు 25%, ఎస్టీలకు 12% రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ రంగాల్లోనూ ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు పాండ్రంకి వెంకట రమణ, దనా రాంబాబు, పి జైహింద్ కుమార్, బొంగ భాను మూర్తి, కెల్ల భీమారావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ లకు, కార్యదర్శిలకు శిక్షణ ప్రారంభం



విశాలాంధ్ర-జామి : మండల కేంద్రమైన జామిలో సర్పంచ్ లకు,పంచాయితీ కార్యదర్శిలకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో పంచా యితీ గ్రామీణాభివృద్ధి అధికారి కె.నాగరాజు పాల్గొన్నారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ సర్పంచ్ లు కార్యదర్శిలు గ్రామాలలో ముఖ్యంగా పారిశుద్యం పై శ్రద్ధ పెట్టాలని సూచించారు. గ్రామాలలో వీధులు పరిశుభ్రంగా వుంటే అంటు వ్యాధులు రాకుండా ఉంటుందని తెలిపారు. సంపద సృష్టించడం వంటి కార్యక్రమం చెయ్యలని తెలిపారు. పలు అంశాలపై అవగాహనా కల్పించారు. ఈకార్యక్రమంలో జెడ్పిటిసి గొర్లె సరయు, యంపిపి యస్. అరుణ, యంపిడివో తిరుమల రావు, ఇవోపిర్డి శ్రీదేవి వివిధ గ్రామాల సర్పంచ్ లు పంచాయితీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

ఇసిఇ ప్రాజెక్టులు భేష్!



విశాలాంధ్ర-నెల్లిమర్ల: సెంచూరియన్ ఇసిఇ విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు బాగున్నాయని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి కితాబిచ్చారు. సోమవారం ప్రాజెక్టుల ను తిలకించి అవి సమాజంలో ఏ మేరకు ఉపయోగపడతాయో అడిగి తెలుసుకున్నారు. వాటిలో జె.హర్షిత టీమ్ తయారు చేసిన ఇన్సులిన్ పంప్, చరణ్ కుమార్ టీమ్ తయారు చేసిన కాంపాక్ట్ ప్రోగ్రామింగ్ లాజిక్ కంట్రోల్ ప్రాజెక్టులు , స్మార్ట్ అగ్రికల్చర్ బాగున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇసిఇ విభాగాధిపతి జోగినాయుడు, డీన్ డాక్టర్ మాధవరావు, డీన్ మురళీ, డీన్ డాక్టర్ సన్నీడయోల్, కె.రమ్య అధ్యాపక బృందంతోపాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ స్వచ్ఛంద క్లాప్ వెహికల్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు రంగరాజు



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఏపీ స్వచ్ఛంద్ర క్లాప్ వెహికల్ డ్రైవర్ల సమస్యల పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏపీ స్వచ్ఛంద క్లాప్ వెహికల్ డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ రంగరాజు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ రంగరాజు, ప్రధాన కార్యదర్శి బంగారు శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వచ్ఛ్ ఆంధ్ర సంకల్ప్ అనే పథకంలో భాగంగా పట్టణాల్లో తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం గాను క్లాప్ వెహికల్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గాని ప్రభుత్వం తరపున వేతనాల చెల్లించే విధానం కాకుండా ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా వేతనాలు ఇవ్వడం వల్ల అనేక ఇబ్బందులకు గురి అవుతున్నామన్నారు. ప్రభుత్వం జీవో ప్రకారం క్లాప్ డ్రైవర్లకు 18,500 వేతనాలు ఇవ్వాలన్నారు. డ్రైవర్ లందరికీ పిఎఫ్, ఈఎస్ఐ, అమలు చేసి ఉద్యోగ భద్రత,జాబ్ కార్డు ఇవ్వాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు మోటార్ యాక్ట్ చట్టం వర్తింపజేసేలా చూడాలన్నారు. డ్రైవర్లకు కాంట్రాక్టు విధానం రద్దు చేయాలన్నారు. 8 నెలల పిఎఫ్ వేసేలా ప్రయత్నం చేయాలన్నారు. డ్రైవర్లకు వారాంతపు సెలవు ఇప్పించాలన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ పొడుగు రామకృష్ణ, కే రవి, వై లక్ష్మణరావు,ఆర్ బంగారయ్య, కే సూరిబాబు, కే సంతోష్, ఎన్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే బేబీనాయన

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి పూల్ బాగ్, గొల్లవీధి మీదుగా దాడితల్లి అమ్మవారు గుడి వరకు గల రొడ్డును , కూటమి ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కే కే రంగారావు (బేబినాయన) మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి లు సిబ్బంది డీఈ, ఏఈ లతో కలిసి సందర్శించారు. రోడ్డు మరమ్మతులు, నిర్మాణ పనులకు కావలసిన నిధులకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు ఆదేశించారు.గతంలో వేసినట్లు కాకుండా నాణ్యమైన రొడ్డులను వేసేవిధంగా ఎస్టిమేట్ లను తయారు చేయాలని సూచించారు. అధికారులు ఎస్టిమేట్ లు తయారు చేసిన తరువాత జిల్లా కలెక్టర్ కి అందజేసి వీలైనంత త్వరగా నిధులు మంజూరు అయ్యేలా ప్రయత్నిస్తానని తెలిపారు.

ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలు

విశాలాంధ్ర-మెరకముడిదాం : మెరకముడిదాం జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ సంవత్సర కాలానికి దూర విద్యా విధానాన్ని ప్రారంభించబడింది. చదువుకునే అవకాశం లేని బాలబాలికులు మరియు వయోజనులకు విద్యను అందించుటకై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం (ఓపెన్ స్కూల్) దూర విద్యా విధానాన్ని ప్రారంభించింది. చదువుకు దూరమైన వారికి బడి మధ్యలో మానేసిన వారికి మరియు 14 సంవత్సరములు నిండి చదవగలిగిన మరియు వ్రాయ గలిగిన పరిజ్ఞానం కలిగి ఎటువంటి విద్యా అర్హతలు లేనప్పటికీ ఆగష్టు 31, 2024 సంవత్సరం నాటికి 14 సంవత్సరములు నిండిన వారందరూ అర్హులే. గరిష్ఠ వయోపరిమితి లేదు, రిజిస్ట్రేషన్ ఫీజు 100 రూపాయలు అందరికీ, అడ్మిషన్ ఫీజు జనరల్ కేటగిరి పురుషులకు 1300 రూపాయలు. ఇతరులు అనగా మహిళలు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు దివ్యాంగులు ట్రాన్స్ జెండర్లు మరియు ఎక్స్ సర్వీస్ మెన్ లకు 900 రూపాయలు. గమనిక:: ఎడ్మిషన్ ఫీజు రాయితీ పొందిన వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు ఆన్లైన్ అప్లికేషన్లో అప్లోడ్ చేయవలెను. ఓపెన్ స్కూల్ కోర్సులో ప్రవేశం పొందే విధానం గ్రామ వార్డు సచివాలయాల ద్వారా ఎస్ ఎస్ సి ఇంటర్, ప్రవేశ దరఖాస్తు నమోదు చేసుకోవచ్చును. https://appopen-school.ap.gov.in వెబ్ సైట్ నందు ప్రాసెస్ గమనించగలరు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పావని, పుష్పారావు ఎంఈఓ 2 ప్రధాన ఉపాధ్యాయులు ఎల్లం నాయుడు సెక్రటరీలు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు ను కలిసి రైతులు

విశాలాంధ్ర-విజయనగరం: ఏఎస్ ఆర్ జిల్లా. అనంతగిరి మండలం, గుమ్మ కోట, భీమవరం, శంకుపర్తి గ్రామాలకు చెందిన పలువురు రైతులు ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి శంకరరావు కలిసి వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. భూసమస్య లతో పాటు శంకుపర్తి గ్రామం లో చనిపోయినవారి మరణ ధృవీకరణ పత్రాలు ఇవ్వడం లేదని తెలిపారు. పాంగి రవీంద్ర, సుర వెంకటేష్,కోటపర్తి సన్యాసి తదితరులు సమస్య లను ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డి.వి.జి శంకరరావు దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చైర్మన్ వారికి హామీ ఇచ్చారు.

అంగన్వాడీలపై వేధింపులు ఆపాలి : మంత్రి కొండపల్లికి వినతి



విశాలాంధ్ర-గజపతినగరం: గజపతి నగరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ లో అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు సోమవారం వారి నివాసం వద్ద కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక పరిస్థితుల్ని చూసి అక్కడ నాయకులతో అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ అనసూయ, గజపతినగరం ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు ఎం సుభాషిని, పి జ్యోతి, సెక్టార్ లీడర్లు బి సౌజన్య, వాణి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటూ గ్రీవెన్స్ లో వినతి

విశాలాంధ్ర-జామి : మండల కేంద్రమైన జామిలోని శివారు ప్రాంతంగా ఉన్న మాధవరాయిమెట్ట కాలనీకి ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. తమ కాలనీలో ట్రాన్స్ఫార్మర్ లేకపోవడం తో విద్యుత్‌లో వోల్టేజ్, విద్యుత్ కోతలు వంటి పలు సమస్యలు ఉన్నాయన్నారు. వెంటనే పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖ ఏఈ చొక్కాకుల దేవుడు బాబుకు గ్రీవెన్స్ వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో మాధవరాయ మెట్ట కాలనీకి చెందిన వలపు నాగరాజు, పైలా గౌరి నాయుడు, మురిపిండి గౌరీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని హత్య ... అభరణాలు చోరీ



విశాలాంధ్ర-బాడంగి: మండల కేంద్రమైన బాడంగి సమీపం లో ఉన్న ముగడ కాలనీ లో నివాసం ఉంటున్న గెద్ద కృష్ణ వేణమ్మ(60) ను ఆదివారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను ఇంట్లోనే హత్య చేసి అభరణాలు చోరీ చేసారు. స్థానిక ఎస్.ఐ. జయంతి అందించిన వివరాలివి. కొడుకులిందరు హరి, నాగేంద్రలు ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు.ఆమె ఒక్కరే కోలనీ లో ఉన్న సొంత ఇంట్లో నివాసం ఉంటున్నారు.ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి ఆమె ఒంటిపై ఉన్న ఆభరణాలను చోరీ చేసారు,పుస్తులు తాడు, నాలుగు గాజులు, మూడు చేతి ఉంగరాలు,జాతి చెవి దిద్దులు దొంగిలించారు.ఆమె మెడపై,ఒట్టి పై గాయాలు చేసి అనంతరం హత్య చేస్తునట్టు పోలీసులు తెలిపారు.సంఘటన విషయాలు తెలిసిన వెంటనే బొబ్బిలి డిఎస్పీ శ్రీను వాసురావు, సి.ఐ. నాగేశ్వరరావు, బాడంగి, రామచంద్ర పురం, తెర్లాం ఎ.ఐ లు జయంతి,జ్ఞాన ప్రసాద్, రమేష్ లు సంఘటన స్థలానికి చేరుకున్నారు.ఆమె కుమారుడు నాగేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

విశాలాంధ్ర విజయనగరం
పేజీ : 2
మంగళవారం 13, ఆగస్టు 2024

ఏనుగులను నివారించండి

ఎమ్మెల్యే కోండ్రు ఆదేశం

విశాలాంధ్ర-రాజాం/వంగర: వంగర మండలం రాజుల గుమడ, వివిఆర్పేట గ్రామాల్లో సంచరిస్తున్న ఏనుగుల సమూహాన్ని నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ అటవీశాఖ అధికారులను, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదలు చేస్తూ ఏనుగుల గుంపు పంట పొలాల్లోకి జొరబడి పంటలు నాశనం చేస్తుండడం వల్ల రైతులు నష్టపోతున్నారని చెప్పారు. మొక్కజొన్న, అరటి, వరి పంటలకు నష్టం వాటిల్లు తోందన్నారు. అంతేకాక, ప్రజలు కూడా భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. కావున అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్నో ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాం...

- ప్రజా వినతుల పరిష్కారంపై మంత్రి కొండపల్లి
- కలెక్టర్ కార్యాలయంలో వినతులు స్వీకరణ

విశాలాంధ్ర-విజయనగరం: ప్రజా వినతుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ఎన్నో వినతులకు తక్షణ పరిష్కారం చూపించగలిగామని రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్.ఆర్.ఐ. వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల కార్యక్రమంలో ఎం.పి. కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, జె.సి. కె.కార్తీక్‌లతో కలసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూప్రజల సమస్యలకు జిల్లాస్థాయిలోనే పరిష్కారం చూపేందుకు మంచి వేదిక అవుతుందన్నారు. అంతకుముందు ప్రజా వినతుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులను ఉద్దేశించి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ వికసిత్ జిల్లాగా రూపొందించడంలో అధికారుల నుంచి పూర్తి సహాయ సహకారాలు అవసరమని మంత్రి పేర్కొన్నారు. జిల్లా అధికారులంతా సమర్ధవంతంగా విధులు నిర్వర్తించి ప్రభుత్వ లక్ష్యాల మేరకు పనులు నిర్వహించడంలో ఒక జట్టుగా పనిచేయాలన్నారు. ప్రజా వినతులను ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ అధికారులందరి పనితీరుపై పర్యవేక్షణ వుంటుందని చెప్పారు.

వినతుల పరిష్కార వేదికకు 287 వినతులు

కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై 287 వినతులు అందాయి. రెవి న్యూ సమస్యలపై 182, డి.ఆర్. డి.ఏకు సంబం ధించి 31, పంచాయతీరాజ్ శాఖకు 20, మునిసిపల్ శాఖకు 20, విద్యా శాఖ, తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలకు 9 వంతున, గ్రామ వార్డు సచివాలయాల శాఖకు 6, ఆసుపత్రుల సమన్వయ అధికారికి 5, వైద్య ఆరోగ్యశాఖకు 3, హౌసింగ్ శాఖకు 2 వంతున వినతులు అందాయి. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డి.ఆర్.ఓ. అనిత తదితరులు వినతులు స్వీకరించారు. పలు రెవిన్యూ సంబంధ సమస్యలపై వచ్చిన వినతుల పరిష్కారానికి సంబంధించి జిల్లా కలెక్టర్ డా.అంబేద్కర్ ఆయా రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్‌లతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడి ఆయా వినతులను పరిష్కరించిన అనంతరం రిపోర్టు చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే తాత్కాలిక ఉద్యోగులు, కార్పొరేషన్ లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రాలు అందజేశారు.

దివ్యాంగుని సమస్యకు తక్షణ పరిష్కారం

వెనువెంటనే వినికిడి పరికరం అందజేత

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు ఒక దివ్యాంగుడు వినతిపత్రం అందించగా వెంటనే జిల్లా కలెక్టర్ ఆయనకు వినికిడి పరికరాన్ని అందించాలని విభిన్నప్రతిభావంతుల శాఖ ఏ.డి.జగదీష్ ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా వినికడి పరికరాన్ని తక్షణమే మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి, ఎంపి తదితరులు విభిన్న ప్రతిభావంతుల వద్దకు వెళ్లి వారి నుంచి వినతులు స్వీకరించారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, పెన్షన్ వితరణ

మాజీ సర్పంచ్ కోట్ల కృష్ణమూర్తినాయుడు

విశాలాంధ్ర-మెరకముడిదాం: మెరకముడిదాం మండలం చినభంటుపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కోట్ల కృష్ణమూర్తి నాయుడు పంచాయతీ పరిధిలో గల మూడు గ్రామాలకు చెందిన పాఠశాల విద్యార్థులుకు నోట్ పుస్తకాలు, పెన్నులు వితరణగా సోమవారం నాడు అందించారు. మూడు పాఠశాల పరిధిలో సుమారు 200 మంది విద్యార్థులుకు పంపిణీ చేసి ఔదార్యం చాటుకున్నారు.ఈ సందర్భంగా కోట్ల కృష్ణమూర్తి నాయుడు మాట్లాడుతూ ప్రతీ ఏటా పంచాయతీ పరిధి లో మూడు పాఠశాల పరిధిలో వున్న విద్యార్థులుకు పంపిణీ చేయటం జరుగుతుందని అన్నారు. ప్రతీ ఏటా విద్యార్థులు కోసం ఎంతో కొంత సేవ చేయటమే నా ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. నేను ఉన్నంత వరకు పేద విద్యార్థులుకు సాయం చేయటం జరుగుతుంది అని ఆయన తెలిపారు. ఇప్పటికే అనేకమంది పేదలకు సేవచేయటం జరిగిందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయలు సిబ్బంది, స్థానిక పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్లో సిబ్బంది తీరుతో ఇబ్బందులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఆధార్ కేంద్రాలలో కొందరు సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండల కేంద్రంలో గల ఆధార్ కేంద్రాలు అని చెప్పి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న సిబ్బంది. బి.ఎస్.ఎన్.ఎల్ ఎక్స్ఛేంజ్ వద్ద గల ఆధార్ కేంద్రం వద్ద మితిమీరిన నిర్లక్ష్యం వ్యవహరిస్తున్న ఆధార్ కేంద్ర సిబ్బంది చుట్టుప్రక్కల గ్రామాలు నుంచి కాక పక్క మండలాల నుంచి ఎంతోమంది ప్రజలు వచ్చి ఆధార్ కార్డ్ లో సవరణలు చేసుకోవాలి వచ్చిన వారితో నిర్లక్ష్య సమాధానం ఇస్తూ ఏదో సాకుతో రేపు రా మళ్ళీ రా అని పంపేస్తున్న వైనంపై విసుగుచెందిన ప్రజలు ఎవరైనా ఎందుకు అలా మీ చుట్టూ తిప్పుతున్నారని అడిగితే ఇంకా మితిమీరి న సమాధానం తో నీకు నేను ఆధార్ చెయ్యను నీకు దిక్కున్న చోట చెప్పుకో అని సమాధానం ఇస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఆధార్ నిర్వాహుడు ఈశ్వరరావు అతని సిబ్బంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి వారిపై తగు చర్యలు తీసుకోవాలి అని ప్రజలు కోరుతున్నారు.

"క్రీస్తు ఆగమనానికి సిద్ధపడు"

సభలను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర -విజయనగరం రూరల్ : జిల్లా కేంద్రమైన విజయనగరంలో ఈనెల 16, 17 తేదీలలో జరగనున్న "క్రీస్తు ఆగమనానికి సిద్ధపడు" సభలను విజయవంతం చేయాలని యేసు ప్రేమాలయం పాస్టర్ అలజంగి రవికుమార్ విజ్ఞప్తి చేశారు. జీసస్ బ్లెస్సింగ్ చర్చ్ విశ్వాసులు రెవరెండ్ నిర్మల సురగాల ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఏసు ఆగమనానికి సిద్ధపడు సభలకు సంబంధించిన గోడ పత్రికను విడుదల చేశారు. పట్టణంలోని గురజాడ కళాభారతిలో జరిగే ఈ సభలకు జిల్లాలోని క్రీస్తు ఆరాధకులు అందరూ హాజరుకావాలని అలజంగి విజ్ఞప్తి చేశారు. అలాగే బైబిల్ ను వివిధ భాషలలోకి తర్జుమా చేసిన విలియం కేరీ జన్మదిన వేడుకలను ఏసు ప్రేమాలయం చర్చిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ మధుసూదన్ లోపింటి, రెవరెండ్ ఆంద్రేయ, పాస్టర్ జయరాజు, రెవరెండ్ జాన్ వెస్లీ, రెవరెండ్ సుబ్బారావు, రెవరెండ్ నిర్మల సురగాల తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని క్రీస్తు ఆరాధకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

నగరపాలక కార్యాలయంలో

ప్రజా వినుతుల పరిష్కార వేదిక



విశాలాంధ్ర విజయనగరం టౌన్: సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం నందు నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదిక నకు 4 వినతులు వచ్చాయి. పలువురు తమ సమస్యలను వెల్లడిస్తూ వినతి పత్రాలను నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు నకు అందజేశారు. ఆయా వినతుల పరిష్కారానికై సంబంధిత విభాగ అధికారులకు కమిషనర్ ఆదేశించారు. శానిటేషన్ కు సంబంధించి 1, హౌసింగ్ కు సంబంధించి 2, ఇతర సమస్య పై 1 చొప్పున వినతులు అందాయి. సిబ్బంది వినతులను స్వీకరించిన కమిషనర్ ఎంఎం నాయుడు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రజల నుండి వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అయ్యే దిశగా కృషి చేస్తామన్నారు. నగరంలో దోమల నియంత్రణకై ప్రతిరోజు ఫాగింగ్ యంత్రాలతో నివారణా చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే ఏంటి లార్వా ఆపరేషన్ నిరంతరాయంగా చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి,ఏసీపీ అమ్మాజీ రావు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

మూడవ ప్రపంచ దేశాల దిక్సూచి, విప్లవ యోధుడు

పెడల్ కాస్ట్రో 98వ జయంతోత్సవం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాల శృంగవరపుకోట లో చరిత్ర శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు మాట్లాడుతూ మూడవ ప్రపంచ దేశాలైన ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాల దేశాల్లోని ప్రజలు స్వేచ్ఛ, స్వతంత్ర, ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచిన మహా నాయకుడు ఫెడరల్ కాస్ట్ర .భారతదేశానికి అలీన ఉద్యమం సమయంలో వినూత్నమైన పాత్రను పోషించాడని విద్యార్థి దశలోనే ఉద్యమ నాయకుడిగా క్యూబా నియంత్రత్వాన్ని అంతం చేయడానికి సాయుధ పోరాటాన్ని నడిపి , 1959లో స్వేచ్ఛాయుత క్యూబా నీ ఏర్పరిచాడు అనంతరం లాటిన్ అమెరికాకు దేశాలైన అర్జెంటీనా, చీలి పెర్ మొదలగు దేశాలలో స్వతంత్ర పోరాటం తన ఉద్యమ సహకారదైన చేగువేరా తో కలిసి ఉద్యమాన్ని నడిపాడు. అమెరికా సామ్రాజ్య వాదం పైన నూతన వలసవాదం, దోపిడీకి అర్ధ శతాబ్దం పాటు అలుపెరుగని పోరాటం చేశాడని విద్యార్థులకు తెలియజేశారు.. చరిత్ర ఉపన్యాసకులు చల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫెడల్ కాస్ట్ జీవిత చరిత్రను వివరిస్తూ నియంత్రత్వ శక్తులు అతను 638 సార్లు చంపడానికి విపుల ప్రయత్నాలు చేశారని వాటిని తప్పించుకొని ఉద్యమానికి నాంది పలికే నియంత్రత్వసక్తులపై పోరాడి లాటిన్ అమెరికా దేశాలు సైతం సామ్రాజ్యవాద దేశంగా తీర్చిదిద్దున గొప్ప విప్లవ నాయకుడు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కే వాసుదేవరావు, ఐక్యూఏసి డాక్టర్ బి సుధీర్, డాక్టర్ జి ఈరన్న, ఎస్కే వలి ఖాన్, శ్రీలక్ష్మి, చల్ల శ్రీనివాసరావు అప్పలరాజు ,శివకుమార్, రామకృష్ణ హైమావతి లక్ష్మణ్, విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాధితుల సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ సోమవారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి, వారి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ 42 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల్లో చాలా వరకు భూవివాదాలకు సంబంధించినవి అధికంగా ఉన్నట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 19, కుటుంబ కలహాలకు సంబంధించి ఒక ఫిర్యాదు, మోసాలకు పాల్పడినట్లుగా 8 ఫిర్యాదులు, ఇతర విషయాలకు సంబంధించినవి 14 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్లయితే చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, విజయనగరం డిఎస్పీ ఆర్.గోవిందరావు, డిసిఆర్బి సిఐ జె.మురళి, ఎస్పీ సిఐలు కే.కే.వి.విజయనాథ్, ఈ.నర్సింహ మూర్తి, డిసిఆర్బి ఎస్ఐ గణేష్ మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

- హెల్మెట్ వాడకంపై విస్తృత అవగాహన
- ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదన
- **43 బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు**
- ఎస్పీ వకుల్ జిందాల్

విశాలాంధ్ర-విజయనగరం : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. రహదారి భద్రతా కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. సమావేశానికి సంబంధించిన అజెండా అంశాలను డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మణికుమార్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలు, కారణాలు, నివారణా చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న 43 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించడం జరిగిందన్నారు. జంక్షన్లు, ముఖ్యంగా జాతీయ రహదారితో, స్థానిక రహదారులు కలిసే ప్రదేశాల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుం టున్నాయన్నారు. ఇలాంటి చోట్ల ప్రమాద నివారణా చర్యలను తీసుకోవాల్సి ఉందన్నారు. అలాగే జాతీయ రహదారుల జంక్షన్ల వద్ద లైటింగ్ పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, హెల్మెట్ వాడకంపై, పోలీసు, రవాణాశాఖలు సంయుక్తంగా అవగాహనా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులంతా విధిగా హెల్మెట్ ధరించేలా వారిని చైతన్య పరచాలని కోరారు. 43 బ్లాక్ స్పాట్స్ ను పోలీసు, రవాణా, నేషనల్ హైవే, ఆర్ అండ్ బి అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి, అక్కడ ఏవిధమైన చర్యలను తీసుకోవాల్సి ఉంటుందో వారం రోజుల్లో తమకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. నివేదిక అందిన నాలుగు వారాల్లో అన్నిచోట్లా ప్రమాద నివారణా చర్యలను తీసుకుంటామని చెప్పారు. వైద్యారోగ్యశాఖ, జాతీయ రహదారుల అధికారులు చర్చించి, జిల్లాలో ట్రామా కేర్ సెంటర్ ను ఎక్కడ ఏర్పాటు చేయాలో నిర్ణయించి, ఈ మేరకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రార్ధనా స్థలాల వద్ద ప్రమాదాలను నివారించేందుకు స్పీడ్ బ్రేకర్లు, సైన్ బోర్డుల ఏర్పాటు తదితర చర్యలను తీసుకోవాలని సూచించారు. అయినాడ జంక్షన్‌వద్ద రోడ్ల వెడల్పు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆర్ అండ్ బి, జాతీయ రహదారులు, పంచాయితీ, మున్సిపాల్టీలు తమ రోడ్లపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి, జాబితాను అందజేయాలని ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖలు పరస్పరం సమన్వయంతో వ్యవహరించి, జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు తగిన ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిటిసి మణికుమార్, జెడ్‌పి సిఇఓ శ్రీధర్‌రాజా, డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ఆర్ అండ్‌బి ఎస్ఇ రత్నకుమార్, డిఎస్‌పి ఆర్.గోవిందరావు, జిల్లా రహదారి భద్రతా కమిటీ సభ్యులు మజ్జి అప్పారావు, వివిధ శాఖల అధికారులు, ప్రతినిధులు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సహాయ ఇన్‌స్పెక్టర్లు, సిఐలు తదితరులు పాల్గొన్నారు. రహదారి భద్రత పై రూపొందించిన కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ..

పట్టణంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: పట్టణంలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యలను పరిశీలించేందుకుగాను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ బ్లాక్ స్పాట్లు, ముఖ్య కూడళ్ళ వద్ద గల ట్రాఫిక్ పాయింట్లను స్వయంగా సందర్శించారు. పట్టణంలోని కామాక్షినగర్, అయ్యన్నపేట, పెద్దాసుపత్రి జంక్షన్, చర్చి జంక్షన్, ఆర్ అండ్ బి జంక్షన్, మాగాయ్దిన్స్ జంక్షన్, ప్రదీప్ నగర్, ఆర్టీసి కాంప్లెక్స్, కోట, కొత్తపేట, అయ్యప్పస్వామి టెంపుల్ జంక్షన్, స్వామి లే అవుట్, రింగు రోడ్డులోని రైతు బజార్ జంక్షన్, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, బాలాజీ జంక్షన్ లను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ స్వయంగా సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు తరుచూ జరుగుటకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా జంక్షన్స్ వద్ద వాహనాల రాకపోకలను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించి, ప్రమాదాలను నియంత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యలను గురించి అధికారులతో చర్చించారు. ప్రమాదాల నియంత్రణకు ఆయా ప్రాంతాల్లో తప్పనిసరిగా కాషనరీ బోర్డులను ఏర్పాటు చేయాలని, స్కూల్స్, హాస్పిటల్స్ ఉన్న ప్రాంతాల్లో స్పీడు బ్రేకర్లును వేయాలని, స్టాపర్లును ఏర్పాటు చేయాలని, రాత్రి సమయాల్లో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా వెలుగు ఉండే విధంగా లైటింగు ఏర్పాటు చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో ఇంజనీరింగు మార్పులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ రెగ్యులేషన్కు తలెత్తుతున్న ఇబ్బందును గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ఫుట్పాత్ వ్యాపారాలు నియంత్రించాలని, వాహనాల పార్కింగు లేకుండా చూడాలని, రేడియం స్టిక్కర్లును ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ క్రమబద్దీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలో అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో తరచూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్స్ స్పాట్స్ గా గుర్తించి, ఆయా ప్రాంతాలను పోలీసు అధికారులు, ఆర్ అండ్ బి, నేషనల్ హైవే అథారిటీ, మున్సిపల్, ఆర్టీఏ అధికారులతో సంయుక్తంగా సందర్శించి, తీసుకోవాల్సిన చర్యలను, ప్రతిపాదనలను పంపాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీసి కాంప్లెక్స్ ప్రాంగణంను సందర్శించి, ఆర్టీసి బస్సుల రాకపోకల మార్గాలను ఆర్టీసి ఆర్.ఎం., ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రజలందరూ సహకరించాలని, విధిగా హెల్మెట్ ధరించాలని, రహదారి భద్రత నియమాలను పాటించాలని ప్రజలకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేసారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు, పట్టనంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఇతర శాఖల సమన్వయంతో ప్రత్యేకంగా చర్యలు చేపడతామని, ఇందుకు సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేసి, ఉన్నతాధికారులకు వంపుతామని తెలిపారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ వెంట విజయనగరం డిఎస్పీ ఆర్.గోవిందరావు, ఎస్పీ సిఐ కే.కే.వి.విజయనాథ్, వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్, టూ టౌన్ సిఐ టి. శ్రీనివాసరావు, ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు, ఎస్ఐలు మురళి, లోవరాజు,రవి, రాజేష్ మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాపాలకుల దినోత్సవం

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి జి.అగ్రహారం ప్రజా గ్రంధాలయాలం ఆవరణలో ఆశయ యూత్ అసోసియేషన్ మరియు ఆశయ రూరల్ లైబ్రరీ వారి ఆధ్వర్యంలో డా॥ ఎస్ఆర్ రంగానాథం. గ్రంథాలయ పితామహుడు. 132వ జయంతి. సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా అయన చిత్రపటానికి. పుష్పమాలతో అలంకరణం. చేసారు. అనంతరం అయన గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ మాట్లాడుతూ చదవటం ఒక వరం. కానీ శృతి మించిన స్మార్ట్ ఫోన్ వినియోగం వల్ల నేటితరానికిపుస్తకాలు చదివే అలవాటు తగ్గిపోతుంది.కొందరు మహనీయుల కృషి వల్ల నేడుకొంతమంది విద్యార్థులైనా పుస్తకాలు చదువుతున్నారు. గ్రంథాలయ శాస్త్ర అభివృద్ధికి, గ్రంథాలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన గణిత శాస్త్రవేత్త షియాలి రామామృత రంగనాథన్ ఆగస్టు 12వ తేదిన 1892 తమిళనాడులోని తంజావూరు జిల్లాలోని షియాలీ అనే గ్రామంలో జన్మించారు. దాదాపు రోజుకు 10-15 గంటలకు పైగా పనిచేస్తూ, వారానికి ఒక్క రోజైనా సెలవు తీసుకోకుండా నిరంతరాయంగా రంగనాథన్ గ్రంథపాలక వృత్తే దైవంగా, పనే జీవితంగా గడిపిన గొప్ప వ్యక్తి. ఆధునిక వైజ్ఞానిక సాంకేతిక రంగాలలో పెను మార్పులు చోటుచేసుకున్న ఈ సమయంలో కూడా గ్రంథాలయాల ప్రాముఖ్యత ఎంతగానో ఉంటుందని ఆనాడే గుర్తించి, గ్రంథాలయాలకు ఒక శాస్త్రాన్ని ప్రవేశపెట్టి, ప్రజలకు విజ్ఞానాన్ని పంచే ప్రజా విశ్వవిద్యాలయాల అని పిలువబడే పౌర గ్రంథాలయాలుకు రూపకల్పన చేశారు. నేడు ఈ ప్రజా విశ్వవిద్యాలయాలకు ప్రజల నుండి ఆదరణ ఉందంటే అది రంగనాథన్ చేసిన కృషి చేసారు అని అన్నార. ఈ కార్యక్రమంలో పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు.

హర్ హర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా

నేడు భారీ ర్యాలీ

విశాలాంధ్ర-గజపతినగరం: బ్రిటిష్ విదేశీ పరిపాలన నుండి భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు నేడు హర్ హర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా గజపతినగరం నియోజకవర్గ బిజెపి యువమోర్చా ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు సాయి సిద్ధార్థ కాలేజ్ నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు 500 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ సరిది దుర్గాప్రసాద్ ప్రకటనలో తెలిపారు కావున ఈ కార్యక్రమానికి దేశభక్తులు ప్రజాస్వామ్య వాదులు పార్టీలకు ప్రాంతాలకు అతీతంగా పాల్గొనవలసిందిగా కోరారు.

జీవో 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలి

విశాలాంధ్ర -శృంగవరపుకోట: 2020వ సంవత్సరంలో విడుదల చేసిన జీవో 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని విద్యా వనరుల కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మండల విద్యాశాఖ అధికారి 1, నర్సింగరావు, 2, లక్ష్మి గార్లకు అందజేశామన్నారు. డిమాండ్లను పరిగణంలోకి తీసుకొని ఉపాధ్యాయ సంఘాలతో చర్చించే నిమిత్తం ఉపాధ్యాయ సంఘాలచే భౌతిక సమావేశం నిర్వహించిన తర్వాతే పని సర్దుబాటు చేయాలని కోరామని లేని ఎడల పని సర్దుబాటును బహిష్కరిస్తామని తెలుపామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు జీవి రమణ, ఎంఈఏఎస్ నారాయణ, ఏ శ్రీనివాస్, వి ఎస్ దేవుడు, ఏ రాము, జి. గణేష్ నాయుడు, జి సూరిబాబు, టి అప్పారావు, సిహెచ్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తొలగించిన వివో ఏ లను

వెంటనే విధుల్లోకి తీసుకోవాలి : సిటూ

విశాలాంధ్ర-శృంగవరపుకోట : అక్రమంగా తొలగించిన వివో ఏ లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని విధుల నుంచి తొలగించిన స్కీం వర్కర్లకు మద్దతుగా ఈవో పి ఆర్ లక్ష్మి, ఏపిఎం సురేష్ కి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. నేటికీ 10 సంవత్సరాలుగా అటు ప్రభుత్వానికి ఇటు గ్రామైక్య సంఘ సభ్యులకు వారధిగా పనిచేస్తూ ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి చేరవేస్తూ గ్రూప్ సంఘ సభ్యులకు లోన్లు ఇప్పిస్తూ పొదుపులు కట్టిస్తూ అనేకసేవలుఅందిస్తు పనిచేస్తున్న వివోఏలను అక్రమంగా తొలగించడం అన్యాయమని అన్నారు. జీతం సకాలంలో అందకపోయినా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ఓర్చుకుంటూ గౌరవంగా కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నారని ప్రభుత్వాలు మారినప్పుడు ఇలా స్కీమ్ వర్కర్లను తొలగించడం వలన గ్రామాలలో వర్గ పోరులు మొదలవుతాయని ఇటువంటి సంస్కృతికి చమర గీతం పాడాలని ఆయన అన్నారు. కొత్తూరు వివో ఏ కక్కల విజయలక్ష్మినియదా విధిగా వివోఏ గా కొనసాగించాలని గ్రామం నుండి పెద్ద ఎత్తిన మహిళలు మద్దతుగా ఎంపీడీవి ఆఫీసు వద్దకు చేరుకొని ఆందోళన నిర్వహించారు. తొలగించిన వారిని యధావిధిగా కొనసాగించకుంటే సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడతామని హెచ్చరించామన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు గొల్ల సత్యనారాయణ గంట్యాడ నాయుడు కొత్తూరు గ్రామం ప్రజలు పాల్గొన్నారు.

సీతంలో జాతీయ లైబ్రేరియన్స్,

అంతర్జాతీయ యువజన ఉత్సవాలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: సీతం ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ లైబ్రేరియన్స్ దినోత్సవ, అంతర్జాతీయ యువజన ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధి గా మెకానికల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆఫీసర్ ఇన్చార్జి లైబ్రరీ జె.ఎన్.టి.యు- జి.వి, విజయనగరం నుండి డాక్టర్. సి. నీలిమ దేవి విచ్చేశారు. ఈ సందర్భంగాఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని జరుపుకోవడానికి ప్రధాన కారణం పద్మశ్రీ డా.ఎస్.ర్ . రంగనాధన్ జన్మదినం అని తెలియజేశారు. డైరెక్టర్ డాక్టర్ ఎం. శశిభూషణ్ రావు మాట్లాడుతూ, కళాశాల లైబ్రరీలో ఎన్నో రకాల అకడమిక్ పుస్తకాలతో పాటు ఈ తరం విద్యార్థులకు ఆసక్తి కలిగించే జీకే, కరెంట్ అఫైర్స్, రీసెర్చ్ పుస్తకాలుతో పాటు డిజిటల్ లైబ్రరీలో ఇ-జర్నల్స్, ఇ -బుక్స్ ఏర్పాటు చేశామన్నారు.ప్రిన్సిపాల్ డాక్టర్ డి. వి. రామ్మూర్తి, కళాశాల గ్రంథాలయాధికారిణి డాక్టర్ లెంక సత్యవతి, కళాశాల చైర్మన్ బొత్స సత్యనారాయణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సిబ్బంది, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.